ఆరోగ్య పింఛన్లపై నీలి నీడలు



ఈ ఫోటోలో కనిపిస్తున్న పింఛన్‌దారు పేరు కుంచాల రమాదేవి. దాచేపల్లి కాపురస్తురాలు. దాదాపు 30 ఏళ్ల క్రితం ఈమె భర్త చనిపోయాడు. గత ప్రభుత్వాల్లో వితంతు పింఛన్‌కి దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమాదేవికి 9 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఎడమ చేయి.. ఎడమ కాలు చచ్చు పడింది. అప్పులు చేసి కుమారుడు వైద్యం చేయించినప్పటికీ రోగం నయం కాలేదు. సదరం సర్టిఫికెట్ తీసుకుని దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. కుమారుడు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రూ.15 వేల పింఛన్ డబ్బులతోనే మందులను కొనుగోలు చేసుకుంటోంది. ఇటీవల అధికారులు వచ్చి వివరాలు సేకరించటంతో ఆందోళన చెందుతుంది.



ఇతని పేరు షేక్ బాల సైదా గామాలపాడు. పక్షవాతానికి గురై కుడి చేయి, కుడి కాలు పనిచేయక మంచం పట్టాడు. అడుగు వేయలేడు.. తీయలేడు. అన్ని పనులు మంచంలోనే. కదలలేని స్థితిలో ఉండటం ద్వారా సర్టిఫికెట్లు పొంది ఆరోగ్య పింఛన్ రూ.15 వేలు పొందుతున్నాడు. గుంటూరు జీజీహెచ్ నుంచి వచ్చిన వైద్యుల బృందం ఇతని ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకుని సంబంధిత సర్టిఫికెట్లు పరిశీలించింది. అప్పటి నుంచి బాలసైదాలో ఆందోళన మొదలైంది. ఏ సాకు చూపించి పింఛన్ తొలగిస్తారోననే భయం అతన్ని వెంటాడుతోంది. అసలే నిరుపేద కుటుంబం. వచ్చిన పింఛన్ డబ్బులతోనే మందులను కొనుగోలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఏమి జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నాడు.

- పునఃపరిశీలన పేరుతో తొలగింపునకు ఎత్తుగడ
- త్వరలో దివ్యాంగ పింఛన్లు సైతం తనిఖీ
- భయాందోళనలో పింఛన్‌దారులు



ఆరోగ్య పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుడి వద్ద వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

దాచేపల్లి : కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య పింఛన్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన చేపట్టడంతో పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. బంబోతుల కృష్ణ, చీదెళ్ల వెంకట సుబ్బారావు, కమతం శేషగిరిరావు, కూరకుల లింగారావు, షేక్ జాను, సుంకర జగన్మోహన్‌రావు, బాడిశ సుబ్బారావు, షేక్ బుడేసాహెబ్, శంకరశెట్టి రాములమ్మ, మంచి బుచ్చయ్య, సంకురాత్రి వీరయ్య..ఇలా ఒక్కరు కాదు. ఇద్దరు కాదు. ఏకంగా 62 మందిలో భయాందోళనలు ప్రారంభమయ్యాయి. దాచేపల్లి నగర పంచాయతీలో 21 మంది, మండల రూరల్ పరిధిలో 41 మంది ఆరోగ్య పింఛన్లు పొందుతున్నారు. వీరంతా అనారోగ్యంతో మంచానికే పరిమితమై పింఛన్లు అందుకుంటున్నారు. గత ప్రభుత్వం అర్హతే ఆధారంగా పింఛన్ మంజూరు చేసింది. ఇప్పుడు కూటమి సర్కార్ సాధ్యమైనంత వరకు పింఛన్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తూ వీరిని ఆందోళనకు గురి చేస్తుంది. కూటమి సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్లు తీసుకుంటున్న వారి సంఖ్యని గణనీయంగా తగ్గించే కుట్రకు తెరలేపింది. అనారోగ్యంతో మంచాన ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని కూటమి సర్కార్ దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతోంది. వెరిఫికేషన్(పునఃపరిశీలన)పేరుతో పింఛన్‌దారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. అసలే అనారోగ్యంతో మంచంలో మూలుగుతున్న పింఛన్‌దారుల వద్దకు పరిశీలనకు వచ్చిన అధికారులను చూసి ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు తీసుకున్న పింఛన్లు అధికారుల తనిఖీల తరువాత వస్తాయో.. రావో అనే భయం వీరిని వెంటాడుతోంది. ఇటీవల ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లిన వైద్యుల బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా వీరి భవితవ్యం తేలనుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆరోగ్య పింఛన్లపై విస్తృతంగా తనిఖీలు చేసిన కూటమి సర్కార్ మరి కొద్ది రోజుల్లో దివ్యాంగుల పింఛన్లు పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. దీంతో ఆరోగ్య, దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

పునఃపరిశీలన చేయాలి



ఆరోగ్య పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్యులు వెళ్లి పరిశీలన చేసి వివరాలు సేకరించారు. గతంలో ప్రభుత్వ అధికారులు, డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగానే వీరికి పింఛన్ మంజూరు చేశారు. ఇప్పుడు కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత సాధ్యమైనంత వరకు పింఛన్లు తొలగించాలనే లక్ష్యంగా అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇప్పుడున్న పింఛన్లు కొర్రీలు పెట్టి తొలగించేలా చర్యలు తీసుకోవటం మంచిది కాదు. ఈ విషయంపై మరోసారి కూటమి సర్కార్ పునఃపరిశీలన చేయాలి.

– కందుల జాను, ఎంపీపీ, దాచేపల్లి

పరిశీలన పూర్తి అయింది



ఆరోగ్య పింఛన్లు తీసుకుంటున్న వారి వద్దకు వెళ్లి వైద్య బృందం పరిశీలన చేసింది. ఆరోగ్య స్థితిగతులతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు పరిశీలించారు. వారి సేకరించిన ఆధారాలు, వివరాలను జిల్లా అధికారులకు నివేదిక ఇస్తారు. తదుపరి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పప్పుల రత్నం, ఎంపీడీవో, దాచేపల్లి

సమస్యలను పరిష్కరిస్తాం

మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు



మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ శివారు ప్రాంతంలోని 9వ వార్డులో కళాకారుల కాలనీలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ కళాకారుల సంఘం వ్యవస్థాపకులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు కాలనీలోని సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తమ కాలనీలో రోడ్లు, మంచి నీటి సౌకర్యం, పారిశుద్ధ్యం పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. స్పందించిన చైర్మన్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కమిషనర్ వేణుబాబుకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుల కాలనీ సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

27 నుంచి దివ్యాంగ పింఛన్ల పరిశీలన

కారెంపూడి: దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. పింఛన్లు పొందుతున్న అందరికి నోటీసులు పంపుతున్నామని 27వ తేదీ నుంచి తనిఖీ బృందాలు దివ్యాంగుల పింఛన్‌లు పొందుతున్న వారి సదరం సర్టిఫికెట్లను, క్షేత్రస్థాయిలో వారి వివరాలను పరిశీలించనున్నారని తెలిపారు. ఏవైనా నకిలీవి ఉంటే గుర్తించడం జరుగుతుందన్నారు. మండలంలో 1,082 దివ్యాంగ పింఛన్‌దారులున్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి



దాచేపల్లి : పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని డ్వాక్రా ఏపీఎం రవికుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో యానిమేటర్ల సమావేశం బుధవారం జరిగింది. డ్వాక్రా సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలికి బ్యాంకు నుంచి రుణాలను ఇప్పించాలని, బ్యాంక్ రుణాల ద్వారా పొదుపు సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన చెప్పారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా యానిమేటర్లు చర్యలు తీసుకోవాలని, పొదుపు సంఘాల మహిళలకు అన్ని రకాలుగా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీసీలు వెంకటేశ్వర్లు, రామారావు, మురళి తదితరులున్నారు.

పట్టణంలో అన్నదానం

మాచర్ల: పట్టణంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహణలో భాగంగా నారాయణ సేవను రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా మాచర్ల రింగురోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్, చెన్నకేశవ స్వామి దేవాలయం, నెహ్రూ నగర్ ప్రాంతాలలో అనాథలు, యాచకులు, వృద్ధులతో పాటు 100 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమాన్ని ఐదేళ్లగా మెట్టు గోవిందరెడ్డి కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా బుధవారంఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆధార్ ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు



మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో రోప్ వే కాలనీ, పూర్ణయ్య షెడ్డు బజారు ప్రాంతాలలో రెండు రోజులుగా మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నారు. బుధవారం రెండు ఆధార్ క్యాంపులలో తనిఖీలు నిర్వహించి, మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు ఈ సెంటర్లు నిర్వహించటం జరుగుతుందన్నారు. రోప్ వే కాలనీ, పూర్ణయ్య షెడ్డు బజారు ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కేంద్రాలు ఉంటాయన్నారు. అందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఆధార్ పొందిన వారికి స్వయంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

39 ఫిర్యాదులు అందజేత



పిడుగురాళ్ల : స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం కన్జూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదులు స్వీకరించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వినియోగదారుడు విద్యుత్ శాఖ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. క్యాటగిరీ 2, 3 వినియోగదారులు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించుకున్నందున విధిగా కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. మాచర్ల డివిజన్ పరిధిలో 39 మంది విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించారన్నారు. విద్యుత్ అంతరాయం, హెచ్చు తగ్గులు, మీటర్, బిల్లుల సమస్యలకు చెందిన 39 అర్జీలు అందినట్లు వాటిలో సత్వరమే 34 పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 5 ఫిర్యాదులు 15 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజయ్ కుమార్, పిడుగురాళ్ల డిప్యూటీ ఈఈ బి.నాగ సురేష్ బాబు, డివిజన్‌లోని ఏఈ ఎస్.సింగయ్య తదితరులున్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి



పిడుగురాళ్ల : బ్యాంక్ లావాదేవీలపై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ వినీత్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.కృష్ణారెడ్డి , రిసోర్సు పర్సన్ బాబురావు, నరసింహనాయక్, సురేష్ అనిల్ కుమార్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఉపాధి హామీ జేఈ గోపి

మాచర్ల: ప్రతి గ్రామంలో శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించేందుకు గ్రామాలలో చైతన్య కార్యక్రమాలను ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్వహించాలని మండల ఉపాధి హామీ జేఈ ఎన్.గోపి మండల ఉపాధి హామీ అధికారి టి.నాగ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ఉపాధి పనులను గుర్తించి శ్రమ శక్తి సభ్యులను చేర్చి ఫిబ్రవరి నుంచి ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్కరూ ఉపాధి లేకుండా ఇబ్బంది పడకూడదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని వారు కోరారు. గ్రామాలలో నిత్యం ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యటించి కూలీ పనులు కావాల్సిన వారిని గుర్తించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పనులు చేయాలని తెలిపారు. వంద శాతం పనులు కల్పించటమే ధ్యేయంగా ఉపాధి హామీ అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు లూర్దు బాబు, కిషోర్, రాఘవ్, అకౌంటెంట్ వేముల శ్రీనివాసరావు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు



శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రమీలగురవారెడ్డి, పశు వైద్యాధికారి బషీర్



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

పశు వైద్యాధికారి ఉమామహేశ్వరి

గురజాల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని తేలుకుట్ల, గంగవరం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పశువులకు సంబధించిన ఏ వ్యాధికైనా వైద్యం చేయించుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. నట్టల నివారణ మందులు, వివిధ వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాల్లో వైద్యుడు జె.నాగార్జున దీపక్, అసిస్టెంట్‌లు వైష్ణవి, పూజా, అనిల్, వీరస్వామి, వీపీ రామారావు, దుర్గా, మౌనిక, శ్రీనివాస్, లక్ష్మీ తదితరులున్నారు.

మిట్టగుడిపాడులో పశు ఆరోగ్య శిబిరం


మిట్టగుడిపాడు(రెంటచింతల): పశు పోషకులకు చేయుతనందించేందుకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ గొట్టం ప్రమీలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. 51 మంది పశు పోషకకులకు చెందిన 10 ఆవులకు, 26 గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, అనారోగ్యంగా ఉన్న 42 పశువులకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. 1150 జీవాలకు బొబ్బ వ్యాధి టీకాలు, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలలో ఉచితంగా పశువులకు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్రచికిత్సలు, తగు వైద్యం చేయడంతో పాటు కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, పశు వైద్య సహాయకులు టి.బాబు, రమేష్‌నాయక్, కె.త్రివేణి, ఎ.కవిత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

425 పశువులకు వైద్య సేవలు

మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని సిన్నెల్లి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 425 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో చూడు పరీక్షలు, నట్టల నివారణకు మందులు గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు, గ్రామ పెద్దలు సుభాని, రామిరెడ్డి, జానీ బాషా పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు ఉపాధి లక్ష్యంగా చర్యలు

మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి అధికారి రాజశేఖర్



మాచర్ల: పట్టణంలోని ప్రతి డ్వాక్రా సంఘాన్ని చైతన్య పర్చి మహిళా గ్రూపులకు ఉపాధి కల్పించటమే ధ్యేయంగా ఆర్‌పీలంతా సమష్టిగా పనిచేసి మంచి ఫలితాలను తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాచర్ల మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి అధికారి బి.రాజశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలో మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలు అంశాలను తెలియపరుస్తూ ఇప్పటికే 1,059 గ్రూపులకు సంబంధించి పూర్తిగా ఆన్‌లైన్‌లో ప్రొఫైల్ రూపొందించటం జరిగిందన్నారు. కేవలం 9 గ్రూపులకు సంబంధించి ప్రొఫైల్ పూర్తి కాలేదని, దానిని పూర్తి చేసి 100 శాతం ఆన్‌లైన్ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా మెప్మా కార్యాలయంలో సర్వీసు ప్రొవైడర్ కింద 129 మంది వివిధ ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవటం జరిగిందన్నారు. వీటన్నింటిని పరిశీలించి పూర్తి స్థాయిలో వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో 100 శాతం జీవనోపాధి కల్పనలో భాగంగా ఒక్కొక్క డ్వాక్రా గ్రూపుకు సంబంధించి ఐదుగురికి ఉపాధి కల్పించేందుకు నూతనంగా యూనిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఆర్థిక, సామాజిక భద్రతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీనదయాల్ ఆవాస్ యోజన కింద ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన కరదీపికలను ప్రతి ఆర్‌పీ గ్రూపులకు వివరించి వారిని చైతన్య పరచి అవగాహన సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెండు లారీలు ఢీ



దాచేపల్లి : రెండు లారీలు ఢీకొన్న ఘటన బుధవారం జరిగింది. దాచేపల్లిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై ఓవర్‌టేకు చేస్తున్న క్రమంలో రెండు లారీలు ఢీకొన్నాయి. పిడుగురాళ్ల వైపు నుంచి రెండు లారీలు దాచేపల్లి వైపుకు వస్తున్నాయి. ముందు వెళుతున్న లారీని మరో లారీ దాటే క్రమంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు లారీలు దెబ్బతిన్నాయి. డ్రైవర్లు, క్లీనర్లు క్షేమంగా బయటపడ్డారు. ఎస్‌ఐ సౌందర్యరాజన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్రేన్ సహాయంతో లారీలను ఘటన స్థలం నుంచి పక్కకు తొలగించారు.

కొనసాగుతున్న గోకుల షెడ్ల నిర్మాణాలు

కారెంపూడి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 11 గోకుల షెడ్ల నిర్మాణం పూర్తయిందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. మొత్తం 25 షెడ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో 11 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, 5 షెడ్ల నిర్మాణాలు రూఫ్ లెవల్‌లో ఉన్నాయని, 9 బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయన్నారు. ఒక్కో షెడ్డుకు ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీగా అందిస్తోందని పేర్కొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధ్యం



రెంటాల పొలం పిలుస్తోందిలో ఏఓ బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న ఏవో సంధ్యారాణి

రెంటాల(రెంటచింతల): వరి పంట సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రెంటాల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు వరి పంట సాగుపై మెలకువలను వివరించారు. సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలను తెలిపారు. వేసవిలో రెండు సార్లు లోతు దుక్కులు దున్ని ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును దుక్కిలో వేసుకోవాలన్నారు. అజొల్లా, నీలి ఆకు పచ్చనాచు, అజొస్పైరిల్లమ్ లాంటి జీవన ఎరువులను పంటలకు ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేయడం, వరి నారు తలలు తుంచి నాటు వేయడం వలన కాండం తొలుచు పురుగు నివారణ.. అలాగే పొలం గట్లపై కలుపు లేకుండా చేయడం వలన పాముపొడ తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. వరిలో తెగుళ్ల, చీడపీడల నివారణకు, నారు మడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

మాడుగులలో పొలం పిలుస్తోంది

గురజాల రూరల్ : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయంలో మేలైన, కొత్త యాజమాన్య పద్ధతులను రైతులకు ప్రదర్శన రూపంలో చూపించడం, తెలియజేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో ప్రవేశపెడుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

మాచర్ల రూరల్: పంటల్లో తెగులు, నల్లతామర పురుగులను నివారించటంలో వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించి మేలైన దిగుబడి పొందాలని వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, జమ్మలమడక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మిరప పంటలో కొన్నిచోట్ల నల్ల తామర పురుగును గుర్తించటం జరిగిందన్నారు. వాటి ఉనికిని తెలుసుకునేందుకు అక్కడక్కడ జిగురు అట్టలను ఏర్పాటు చేసి వాటి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే పిప్రొనిల్ మందును పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రైతులు ఈ కేవైసీ చేయించుకొని రైతులు సంబంధిత కార్యాలయాలలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం వరి, మిరప, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఏఈఓ అభిషక్త వర్మ, ఎంపీఈఓ అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

డీఎస్పీ జగదీష్



దాచేపల్లి : హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులతో డీఎస్పీ మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం హెల్మెట్ ధరించి పోలీసు సిబ్బందితో కలిసి ఆయన ద్విచక్ర వాహనం నడిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 1.50 లక్షల మంది చనిపోతున్నారని, లక్ష మందికిపైగా దివ్యాంగులుగా మారిపోతున్నారన్నారు. మద్యం తాగటం, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపటం వలనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఆయన చెప్పారు. ఊరికి వెళ్లే సమయాల్లో తప్పనిసరిగా హౌస్‌లాక్ సమాచారం పోలీసులకు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చోరీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంవీఐ డి.శేషిరెడ్డి, ఏఎంవీఐలు శ్రీనివాసరావు, సురేష్, సీఐ భాస్కర్, ఎస్‌ఐలు పాపారావు, సౌందర్యరాజన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభం

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వార్షిక మహోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నవదిన ప్రార్థనలలో భాగంగా ప్రతి రోజు జపమాల, దివ్యపూజాబలి నిర్వహించనున్నట్లు కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. కానుకమాత చర్చిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫాదర్ వైఎల్ మర్రెడ్డి మాట్లాడుతూ 24న సాయంత్రం 4.30 గంటలకు మాచర్ల నిత్యసహాయమాత చర్చి విచారణ గురువులు (షష్టిపూర్తి) రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి జెండాను ఆవిష్కరించిన అనంతరం కానుకమాత దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే దివ్యపూజాబలితో మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రార్థనల్లో భక్తులు పాల్గొని కానుకమాత దీవెనలు పొందాలని ఫాదర్ మర్రెడ్డి కోరారు.

సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రంగానాయక్

మాచర్ల రూరల్: బంజారుల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త అయిన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి సెలవు దినంగా నిర్ణయించాలని పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమావత్ రంగా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఆధ్యాత్మిక బోధనలతో గిరిజనులలో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అధికారిక సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఏపీ కూడా స్పందించాలని కోరారు.